# మనసు

-బత్తుల వెంకట దుర్గాప్రసాదరావు

మళ్ళీ అడిగింది సూరమ్మః " ఒరే నానీ పుణ్యక్షేత్రాల యాత్రకు నన్ను పంపించరా" అని

"అలాగేలే" అన్నాడు నానాజి చిరాకుగా.

"అలా చిరాకు పడకురా. తీర్థయాత్రలు చేయాలని ఉందిరా.'' ఆర్తిగా అడిగింది సూరమ్మ.

"అమ్మా ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ పోరకు" విదిలింపుగా అన్నాడు నానాజి.

"తీర్చలేని వాగ్దానాలు ఎందుకు-సూటిగా చెప్పేయండి." చటుక్కున అంది నానాజి భార్య సుజాత.

''నానీ, రాను రాను నిస్సత్తువ పెరుగుతున్నదిరా."

"కోరిక మాత్రం వదులుకోవు" తల్లికి వెంటనే అడ్డుతగిలాడు నానాజి.

నొచ్చుకుంది సూరమ్మ. ఎలా నచ్చచెప్పాలో అర్థం కాలేదు ఆమెకు.

"వయస్సూ, మామగారూ ఉన్నప్పుడే ఆ పుణ్యక్షేత్రాలు ఏవో చుట్టి రావలసింది అత్తయ్యగారు." గొణిగింది సుజాత.

"అప్పటి మా పరిస్థితి వేరమ్మా" చెప్పింది సూరమ్మ.

"ఇప్పుడూ - ఎక్కడ గొంగళి అక్కడేగా" గబుక్కున అంది సుజాత.

''అదేమిటి తల్లీ... నాని ఉద్యోగం చేస్తున్నాడు. సంపాదిస్తున్నాడు."

"ఆ.. ఆ.. పట్టణం బ్రతుకులు-మీకేం తెలుసు. ఎంత సంపాదించినా చాలటంలేదు. ఐనా పెద్దావిడై ఉండి మీరు అలా అనకూడదుస్మీ" అంది సుజాత.

నానాజి ఏమీ మాట్లాడలేదు.

''ఈ ఊరువాళ్ళ చుట్టాలే పట్నంలో ఉన్నారట. ప్రతి యేట రెండుసార్లు యాత్రా బస్సు వేస్తున్నారట. పన్నెండు క్షేత్రాలు, ఎనిమిది వేలకు చూపుతున్నారట." అంది సూరమ్మ మరొకసారి.

"ఎన్నిసార్లు వల్లిస్తారూ - ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ చెబుతున్నదేగా. ఆ వేలే ఉంటే పంపమా" అంది సుజాత తలాడిస్తూ.

''ఒరే నానీ, మన పక్కింట్లో ఉంటున్న అప్పలస్వామి మన ఈ ఇంటిపై తాకట్టుగా పదివేలు ఇస్తానన్నాడు. అదీ అస్వాధీనపు తనఖాగా ఇస్తానంటున్నాడు". అంది సూరమ్మ ఆశగా.

"అమ్మా ఏమిటి రాను రాను నీ పట్టుదల. తర్వాత పదివేలు తీరటం మాటలా?" అన్నాడు నానాజి కోపంగా.

"ఆవిడకేం, తర్వాత ఇల్లు పోతుంది" అంది సుజాత వెంటనే.

"అయినా నీకు ఏమిటి ఈ పిచ్చి ఆలోచనలు వస్తున్నాయి. నీ తలకు పుడుతున్నాయా? ఎవరేనా చెబుతున్నారా!" గబగబ అన్నాడు నానాజి.

"ముసలికాలం.. చాదస్తం" గొణిగింది సుజాత.

అంతలో శివయ్య వచ్చాడు.

శివయ్య - సూరమ్మ ఎదురింటివాడు. కిరాణా కొట్టు నడుపుతున్నాడు.

చాన్నాళ్ళుగా సూరమ్మ కుటుంబంతో మంచి పరిచయం ఉన్నవాడు.

" ఏరా నానాజీ ఎప్పుడు వచ్చావు?" వస్తూనే శివయ్య అన్నాడు పలకరింపుగా.

" ఇప్పుడే వచ్చాను మామయ్యా" చెప్పాడు నానాజి.

"ఏమ్మా బాగున్నావా?" అన్నాడు శివయ్య - సుజాతతో.

"ఉ" అంటూ తలాడించింది సుజాత.

"ఈసారీ పిల్లలను తీసుకురాలేదా" అడిగాడు శివయ్య.

"ఉహు. లేదు, మేము వచ్చినా ఒకరోజు కంటే

ఎక్కువ ఉండలేం. నీకు తెలియందా? ఒకరోజు ముచ్చటకే పిల్లలను నలిపేయడం ఎందుకూ" అన్నాడు నానాజి.

ఇంతలో కల్పించుకొని సుజాత అంది: "అయినా పిల్లలు ఇక్కడకు రావడానికి ఇష్టపడరు. వాళ్ళు గట్టిగా నవ్వినా, మాట్లాడినా ఈవిడ మందలిస్తారు. వాళ్ళ ఇష్టప్రకారం ముస్తాబైనా ఈవిడకు తప్పు. చిన్నపిల్లలని చూడరు. ప్రతి దానికి తప్పులు పడతారు. చీవాట్లు పెడతారు. అందుకే వాళ్ళు రారు. మేమూ తేలేదు."

"పోనీ ఏదో ఇలాగైనా అప్పుడప్పుడు మీరైనా వస్తున్నారు." అన్నాడు శివయ్య.

"ఆ వస్తాం. మనసుకు శాంతా... పాడా" ఫిర్యాదుగా అంది సుజాత.

"ఏం" శివయ్య అన్నాడు.

"ఏం ఉంది.. అమ్మ చాదస్తం - పుణ్యక్షేత్రాలు, యాత్రల గొడవ... ఏదో రగడ. ఛఛ" అన్నాడు నానాజి చికాకుగా.

"అది కాదురా నానాజీ, ఆ యాత్ర ముచ్చట ఏదో తీర్చేయకూడదా. అమ్మ ఆనందిస్తుంది" అన్నాడు శివయ్య చనువుగా.

"ఏమిటి నువ్వుకూడా... అంత డబ్బు ఎక్కడిదీ" -నానాజి.

"ఈ ఇంటి మీద డబ్బులు ఇస్తారటగా" -శివయ్య.

"ఆ.. ఆ.. ఆ మాటలయ్యాయి. అది జరగని పని." కచ్చితంగా చెప్పాడు నానాజి.

"అదేమిటిరా, అంత నిష్కర్షగా మాట్లాడుతున్నావు! అయినా పట్నంలో ఇల్లు కట్టుకున్నావు. ఉద్యోగం చేస్తున్నావు. బాగా వెనకేసుకుంటున్నావుట..."

శివయ్యకు అడ్డు పడింది సుజాత: "చాల్లెండి. ముగ్గురు పిల్లలు. వాళ్ళ చదువులు - అందులో ఇద్దరు ఆడపిల్లలు - వాళ్ళ పెళ్ళిళ్ళు - ఎంత కూడబెట్టినా ఏ మూలకు. ఆ ఇంటికై తెచ్చిన బ్యాంకు లోను ఇంకా తీరనేలేదు."

"నిజమే అమ్మా. కానీ మీరు కాక ఈ ముసలిదాన్ని ఎవరు చూస్తారు. ఖర్చులో ఖర్చు అనుకొని మీ అమ్మ కోరిక తీరిస్తే పోలా" అన్నాడు






శివయ్య కలుపుగోలుగ.

సుజాత ఏదో అనబోయింది.

అప్పుడే-

"సుజా పద. శివాలయం వరకు పోదాం. పూజారి లోకాభిరామాయణం చెప్తాడు. ఈ హైరానా తగ్గుతుంది" అన్నాడు నానాజి ఆ సంభాషణను తుంచేయాలని.

వెంటనే అక్కడ నుండి బయటకు నడిచాడు శివయ్య - పని ఉందంటూ.

సూరమ్మ ఏకైక సంతానం నానాజి. పట్టణంలో ఉంటున్నాడు. అతడి చదువు అంతా పట్టణంలోనే

జరిగింది. పట్టణంలోనే ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం దొరికింది. దాంతో అతడికి పట్టణ వాతావరణం అంటే ఇష్టమైంది. అతడి అభిరుచులకు తగ్గ సుజాతే అతడి భార్యగా రావడంతో వాళ్ళ పిల్లలు కూడా అదే పంథాలో పోతున్నారు. పల్లె మీద అయిష్టతకు, నగర జీవితానికి, ఒకింత విచ్చలవిడితనానికి వాళ్ళు అలవాటుపడ్డారు.

మొదటి నుండి పల్లె వాతావరణంలో కలుపుగోలుగా ఉన్న సూరమ్మ - నానాజి కుటుంబంలో ఇమడలేక - ఈ పల్లెటూరులోనే కాలం గడిపేస్తోంది. సూరమ్మ మొగుడు పొలంపనులు చేసుకుంటూ సంసారం నెట్టుకుంటూ వచ్చాడు తను ఉన్నంతవరకు.

మొగుడు ఉన్నప్పుడు అతడికి చేదోడుగా సూరమ్మ ఇంటివద్దే పచ్చళ్ళు, అప్పడాలు, ఒడియాలు, జంతికలు, చెగోడీలు లాంటివి చేసి అమ్మేది. మొగుడు పోయిన తర్వాత మదుపులు పెట్టలేక, తమ సంపాదనగా మిగిలిన మిద్దింటిలో ఉంటూ మంచితనంతో బ్రతుకు వెళ్ళదీస్తోంది.

శివయ్య ఇచ్చిన పెట్టుబడితో అతడి కిరాణా కొట్టుకు జంతికెలు, చెగోడీలు, పాలకాయలు, సున్నుండలు లాంటివి - పకోడీలు, బూరెలు లాంటి దినవారీ అమ్మకానికి కావలసినవి వండి అందిస్తుంటుంది. బదులుగా రోజూ సామాన్య ప్రతిఫలం శివయ్య నుండి అందుకుంటుంది.

ఇప్పటికీ ఎంతో ప్రయాస పడుతోంది సూరమ్మ.

నానాజి మాత్రం - 'నీకేం హాయిగా ఉంటున్నావు' అనేసి ఏదో పండగకు బట్టలు మాత్రం తీసి ఇస్తూ చేతులు దులిపేసుకుంటూ వస్తున్నాడు. అప్పుడప్పుడు నానాజి ఈ పల్లెటూరు వస్తుంటాడు. అతడి వెంట సుజాత ఒక్కొక్కప్పుడు వస్తూ ఉంటుంది. వాళ్ళు వచ్చేది సూరమ్మను చూడడానికన్నది నెపం మాత్రమే. సూరమ్మ తమ ఇంటిని ఎక్కడ చెయ్యిజార్చేస్తోందో అన్న శంకతోనే వాళ్ళు ఇలా ఈ పల్లెటూరుకు వస్తూ పోతూ ఉంటారు - ఆ ఇంటి వారసులుగా.

ఇది జరిగిన కొన్ని నెలల తరువాత-

ఒకరోజున...

'మీ అమ్మ చనిపోయింద'ని నానాజికి ఫోన్ వచ్చింది - శివయ్య నుండి.

నానాజి వచ్చాడు. సుజాత, పిల్లలు రాలేదు.

తమ ఇంటిముందు శివయ్య, శివాలయం పూజారి, అప్పలస్వామి, మరికొంతమంది ఉన్నారు.

"రాత్రి వరకు బాగుంది. ఉదయం ఒంట్లో నలతగా ఉందంది. అంతే. ఏడు గంటల ప్రాంతంలో పోయింది" చెప్పాడు శివయ్య.

"పూటన్నర గడిచిపోయింది. ఇంకా ఉంచటం మంచిదికాదు. అన్నీ సమకూర్చి పెట్టాం. వచ్చి మీ అమ్మ దహనక్రియలు పూర్తి చేయి" చెప్పాడు అప్పలస్వామి.

తలో చేయి వేయగా సూరమ్మ దహన సంస్కారం ముగిసింది.

" ఇక మీరు చెయ్యవలసిన మిగతా కార్యక్రమాలు..." అని చెప్పబోతున్న శివాలయం పూజారికి అడ్డుపడి-

"నేను వాటిని మా ఊరిలో చేస్తానులెండి" అన్నాడు నానాజి.

బిత్తరపోయాడు శివాలయం పూజారి.

ఆ రాత్రి-

"భోజనానికి ఇంటికి వస్తారా? పంపించమంటారా? అడగమన్నారు మా నాన్న" అని అడిగాడు నానాజి వద్దకు వచ్చిన శివయ్య కొడుకు.

"వద్దు. - పళ్ళు ఉన్నాయి." క్లుప్తంగా చెప్పాడు నానాజి.


శివయ్య కొడుకు వెళ్ళిపోయిన తర్వాత, అప్పలస్వామిని పిలిచాడు నానాజి.

"నేను మా ఇంటిని అమ్మేస్తాను. ఆ విషయమై మాట్లాడదాం. కూర్చోండి." అన్నాడు నానాజి, అప్పలస్వామితో.

అప్పలస్వామి కూర్చున్నాడు మౌనంగా.

"మీరు ఒకనాడు మా ఈ ఇంటి మీద పదివేలు తాకట్టుగా ఇస్తామన్నారట మా అమ్మతో" అన్నాడు నానాజి.

"అవును" అన్నాడు అప్పలస్వామి.



స్థలం మారినా స్థానం మారినా
అవస్థలు మానునా అజ్ఞానీ
గుణం మార్చుకో బాధ్యత పెంచుకో
బాగుపడతావోయ్... బడుద్ధాయ్...

**-వాస్తువ్యాధి**

"మరి ఇప్పుడు మనం ఒక రేటు అనుకొని మీరే ఈ ఇంటిని కొనుక్కోండి." చెప్పాడు నానాజి.

"నేను అప్పుడు అంత మొత్తం డబ్బు మీ అమ్మగారి మంచితనం బట్టి, ఆవిడ పుణ్యక్షేత్రాల యాత్రకు పడ్డ ఆరాటం బట్టి ఇస్తానన్నాను. కానీ నిజానికి ఈ చిన్న మిద్దింటికి ఆ విలువా లేదు... నాకు అవసరమూ లేదు.

చూడు బాబూ, మీ అమ్మగారు తీర్థయాత్రలకు పట్టుపట్టింది పుణ్యం మూటకట్టుకుపోవడానికి కాదు – నీ అభివృద్ధికి ఆవిడ మొక్కులు మొక్కుకుందట. వాటిని తీర్చుకోడానికి ఆవిడ ఆరాట పడింది. అబ్బే నువ్వు సాగనిచ్చావా – పాపం.

నువ్వు ఈ ఇంటి మీద మోజు పడుతున్నావని, ఈ ఇంటి పెరటి భాగం అప్పుకైపోతుంటే మీ అమ్మగారు తన కడుపు మాడ్చుకుని డబ్బు కూడపెట్టి బాగుచేయించింది – నీకోసమే.

ఎప్పుడైనా నువ్వు నిదానంగా, స్థిరంగా మీ అమ్మగారితో మాట్లాడేవా? నీకు ఈ ఇంటిమీద యావే తప్ప మీ అమ్మగారి మీద ధ్యాసేది! కొడుకుగా నువ్వు చెయ్యవలసింది ఏమైనా చేశావా? ఆ..." అన్నాడు అప్పలస్వామి సూటిగా.

అవాక్కయిపోయాడు నానాజి. ఆలోచనలో పడ్డాడు.

మర్నాడు.

శివాలయం పూజారిని సంప్రదించి, తిరిగి తన పట్టణం వెళ్ళిపోయాడు నానాజి.

సూరమ్మ చనిపోయిన 11వ రోజున తిరిగి తన పల్లెటూరు వచ్చాడు నానాజి – కుటుంబసమేతంగా.

శివయ్య, అప్పలస్వామి, శివాలయం పూజారి సమక్షంలో ఊరి పెద్దలకు తమ ఇంటిని శివాలయం ఆస్తికి చెందేలా వ్రాయించబడ్డ పక్కా పత్రాలను అందించాడు నానాజి.

అలాగే ఇరవై ఐదు వేల రూపాయలు బ్యాంకులో శాశ్వత జమగా ఉంచానని, ప్రతి యేటా వచ్చే దాని వడ్డీని ఇంటి పరిరక్షణ కొరకు వాడుకొనేలా గ్రామ పంచాయితీ చూసుకోవాలని కోరుతూ, వాటికి సంబంధించిన పత్రాలను కూడా వాళ్ళకు ఇచ్చాడు.

తమ ఇంటిని 'సూరమ్మ కుటీరం'గా గుర్తించి సత్ కార్యక్రమాలకు వినియోగింపబడేలా చూడమని వాళ్ళను అర్థించాడు. తను కూడా తరచు వస్తూ అందుకు అన్ని విధాల సహకరిస్తానన్నాడు.

ఆ రోజునే తొలి సత్ కార్యక్రమంగా ఆ ఇంటిలో తన తల్లి పేరున 'అన్నదానం' భారీగా నిర్వహించాడు.

పిమ్మట సంతృప్తిగా తిరిగి పట్టణం వెళ్ళిపోయాడు నానాజి.

శివయ్య, అప్పలస్వామి, శివాలయం పూజారులకు నానాజీలో ఈ మార్పు ఆశ్చర్యం కలిగించింది.

నానాజి ఇంత చేసినా అప్పలస్వామి మనసుకు మాత్రం–

సూరమ్మ మనసుకు తృప్తి కలిగిందా?

ఆమె ఆత్మ శాంతించిందా? అని అనుమానం.

ఉ..., సూరమ్మ మనసుకు తృప్తి కలుగుతుంది... ఆమె ఆత్మ శాంతిస్తుంది.

ఎంతయినా ఆమెది తల్లి మనసుకదా. ❍